సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం। 10। జూన్। 2024



నాన్నలా శిక్షణ..అమ్మలా లాలన

దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇం దుకోసం భవిత కేంద్రాల ఐఈఆర్‌పీలు ఇంటింటి సర్వే నిర్వహించారు. -2లో



'ఫిట్' చేస్తేనే ఫిట్‌నెస్

రాజంపేటలోని ఇండోర్ స్టేడియంలో ఉన్న జిమ్ పరికరాలు రూ.10లక్షల విలువ చేయనున్నాయి. వీటిని బాగుచేస్తే క్రీడాకారుల శరీర దృఢత్వానికి దోహదపడగలవు. -2లో

గరిష్టం/కనిష్టం
35.6/25.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 25.8 – 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్ : ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పెండ్లిమర్రిలో అత్యధికంగా 9.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే సీకే దిన్నెలో 7.4, ప్రొద్దుటూరులో 7.2, బద్వేల్‌లో 6.6, చెన్నూరులో 6.2, అట్లూరులో 5.4, బి.కోడూరులో 5.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మైదుకూరులో 5 మిల్లీమీటర్లు, దువ్వూరులో 4.6, కడప, సిద్దవటంలో 4.2, వేములలో 4, గోపవరంలో 3.4, పోరుమామిళ్ల, చాపాడు, ఒంటిమిట్టలో 3.2, బి.మఠంలో 2.4, లింగాలలో 2.2, చక్రాయపేటలో 2, వేములలో 1.6, రాజుపాలెంలో 1.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మెరిసిన తేజస్వితరెడ్డి



కడప ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో కొత్తపల్లి తేజస్విత్ రెడ్డి ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 262వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. స్వస్థలం కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె. ఇతని తండ్రి విజయబాస్కర్‌రెడ్డి మైలవరం మండలం దొమ్మరనంద్యాలలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు, తల్లి మనోరాణి జమ్మలమడుగు బీసీ కళాశాల బాలికల వసతి గృహ సంక్షేమాధికారిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి తేజస్వితరెడ్డి మాట్లాడుతూ ఐఐటి చెన్నై లేదా ఐఐటి ఖరగ్‌పూర్‌లో కంప్యూటర్ బ్రాంచ్ తీసుకుని మంచి సాఫ్ట్‌వేర్ కావడం తన ముందున్న లక్ష్యమన్నారు. అనంతరం ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించి కొంతమందికి ఉద్యోగాలను కల్పించడే జీవితాశయం అన్నారు.

డైరెక్టర్ పదవికి రాజేశ్వరి రాజీనామా



దాసరి రాజేశ్వరి

రాజంపేట రూరల్: ఏపీ దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి దాసరి రాజేశ్వరి రాజీనామా చేశారు. ఆదివారం తన కార్యాలయంలో విలేఖరులకు ఈ విషయాన్ని తెలియజేశారు.

రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్‌కు..



కె.సురేంద్రనాథ్

తంబళ్లపల్లె: రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేంద్రనాథ్ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ వెల్ఫేర్ డిపార్టుమెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు తెలిపారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన పెద్దిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటానని చెప్పారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్‌టెస్ట్



బెల్ట్ టెస్ట్‌కు హాజరైన క్రీడాకారులతో అతిథులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం తైక్వాండో బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ తైక్వాండో క్రీడాకారులు మాస్టర్ బిలాల్, మాస్టర్ జంషీర్‌లు విచ్చేసి ప్రారంభించారు. యెల్లో బెల్ట్, గ్రీన్ బెల్ట్, బ్లూ బెల్ట్ విభాగాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. అనంతరం చక్కటి ప్రతిభ కనబరిచిన 40 క్రీడాకారులకు బెల్టలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్యలు సాధన చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.నజీర్‌అహ్మద్, కార్పొరేటర్ సూర్యనారాయణపాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండకు పోటెత్తిన భక్తజనం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా నమ్మిన భక్తజనం ఆలయానికి ఉదయం నుంచే తరలివచ్చారు. పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరు తాగి అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు.

ఒక్క ఛాన్స్ ప్లీజ్!

- మంత్రివర్గంలో ఛాన్సు కోసం ఆశావహుల ప్రయత్నాలు
- బీజేపీ కోటాలో దక్కించుకునేందుకు 'ఆది' భారీ ఎత్తుగడలు
- మహిళా కోటాలో అవకాశం కోరుతున్న మాధవిరెడ్డి
- 'ఒక్క ఛాన్స్'అంటున్న ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరద
- బీసీ కోటాలో అవకాశం కల్పించాలని పుట్టా సుధాకర్ అభ్యర్థన



సాక్షి ప్రతినిధి, కడప: రాష్ట్ర మంత్రివర్గంలోకి వెళ్లేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఎవరికి వారు విశేష ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. సామాజిక సమీకరణలో భాగంగా అవకాశం కల్పించాలని కొందరు యత్నిస్తే, అపార అనుభవం ఉంది, ఒక్క అవకాశం ఇవ్వాలని మరికొందరు యత్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రమాణస్వీకారంలో నిమగ్నమైన అధినేత చంద్రబాబు సోమవారం నుంచి మంత్రివర్గ కసరత్తు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా నేతలు గాడ్‌ఫాదర్‌లను ఆశ్రయిస్తున్నారు. బీజేపీ కోటాలో ఛాన్సు కోసం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అత్యంత వేగంగా పావులు కదుపుతోన్నారు.

- ఉమ్మడి జిల్లాలో ఏడు ఎమ్మెల్యే స్థానాలు తెలుగుదేశం కూటమి వశమయ్యాయి. ఇందులో ఐదుగురు తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వారున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోటీ ఉన్న నేపథ్యంలో తొలిసారి ఎన్నికైన వారిని మంత్రివర్గంలోకి అవకాశం లేకపోతే, జిల్లాలో ఇద్దరికే ఛాన్సు కన్పిస్తోంది. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, వరదరాజులరెడ్డి సీనియర్లుగా మిగలనున్నారు. బీజేపీ కోటాలో మంత్రిగా అవకాశం దక్కించుకునేందుకు ఆదినారాయణరెడ్డి పెద్ద ఎత్తున పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఇప్పటికే కేంద్ర పార్టీ పెద్దలతో మంతనాలు సాగిస్తున్నారు. కాగా రాయలసీమ కోటా పరంగా చూస్తే ఇక్కడున్న ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేల్లో ఆదినారాయణరెడ్డి మాత్రమే సీనియర్. ఆదోని, ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యేలు పార్థసారధి, సత్యకుమార్ ఇద్దరూ తొలిసారిగా ఎన్నికైన వారే కావడం ఆదికి అదనపు బలంగా నిలుస్తోన్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.



ఆదినారాయణరెడ్డి

బీసీ కోటాపై ఆశలు పెట్టుకున్న పుట్టా

మైదుకూరు నుంచి ఎన్నికైన పుట్టా సుధాకర్‌యాదవ్ బీసీ కోటాలో మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేస్తారనే ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యం, గతంలో లభించిన ప్రాధాన్యత దృష్టి పెట్టుకొని అవకాశం కల్పిస్తారనే ఆశాభావంలో ఉన్నారు. మరో వైపు వియ్యంకుడు ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడుకు అవకాశం లేకపోతే, తప్పకుండా తనకు దక్కుతోందనే భావన కూడా ఆయన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.



సుధాకర్‌యాదవ్

ఇరవై ఏళ్ల చరిత్ర తిరగరాశామంటున్న మాధవీరెడ్డి



ఆర్ మాధవీరెడ్డి

కడప గడ్డపై 2004 నుంచి టీడీపీ ఓటమి పాలవుతోంది. 2024లో చరిత్ర తిరగరాశాం. అవకాశం కల్పిస్తే పార్టీ ఉన్నతికి విశేషంగా కృషి చేస్తామనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈమారు మహిళ కోటాకు పెద్దఎత్తున పోటీ ఉండడం విశేషం. రాయలసీమ జిల్లాల్లో రెడ్డి సామాజిక వర్గం నుంచి పాణ్యం, ఆళ్లగడ్డ, పుట్టపర్తి ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, భూమా అఖిలప్రియ, పల్లె సింధూరరెడ్డి, నెల్లూరు జిల్లా నుంచి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కోసం ప్రయత్నిస్తున్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కేంద్ర కేబినేట్‌లో అవకాశం దక్కకపోవడంతో, ఆయన సతీమణీ ప్రశాంతిరెడ్డికి రాష్ట్రంలో ఛాన్సు ఉంటుందనే అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్త పరుస్తున్నారు. అనంతపురం జిల్లా నుంచి పరిటాల సునీత సైతం మహిళ కోటాలో అవకాశం కోసం పట్టుబడుతున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో తొలిసారి ఎన్నికైన మాధవీరెడ్డికి అవకాశాలు తక్కువగా ఉన్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. జిల్లాలో బీజేపీకి కేటాయిస్తే, మహిళా కోటాలో తనకు ఛాన్సు దక్కనున్నట్లు మాధవీరెడ్డి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ముఖ్యనేత ద్వారా..



వరదరాజులరెడ్డి

తెలంగాణకు చెందిన ముఖ్యనేత ద్వారా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మంత్రివర్గంలో ఛాన్సు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎమ్మెల్యేగా 6సార్లు ఎన్నికైన చరిత్ర వరదకు ఉంది, పైగా ఇప్పటివరకూ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి మంత్రివర్గంలో ప్రాతినిథ్యం దక్కకపోవడం కూడా అదనపు బలంగా నిలుస్తోంది. సుదీర్ఘ అనుభవం ఉన్నా మంత్రి పదవి ఇప్పటికీ దక్కలేదు. అందివచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకునే దిశగా పావులు కదుపుతోన్నారు. అదే విషయాన్ని తెలంగాణ ముఖ్యనేత ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబుకు వివరించినట్లు సమాచారం. నిబద్ధతతో పార్టీ ఉన్నతి కోసం పనిచేస్తామనే ఒక్క అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు సమాచారం. సీనియర్లుగా ఎమ్మెల్యేలు ఆది, వరద ఇరువురు వివిధ మార్గాలల్లో మంత్రివర్గంలోకి అవకాశం కల్పించాలని కోరుతున్నా, తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు కూడా విశేష ప్రయత్నాలు చేస్తున్నారు.

మైనార్టీ కోటా కోసం షాజహాన్ యత్నం



షాజహాన్‌బాషా

అన్నమయ్య జిల్లాలో ముస్లిం మైనార్టీ కోటాలో అవకాశం కల్పించాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నంద్యాల ఎమ్మెల్యే ఫరూక్‌కు అవకాశం కల్పిస్తే షాజహాన్‌కు మిస్ అయ్యే అవకాశం లేకపోలేదు. అలా కూర్పు నిర్వహిస్తే పీలేరు ఎమ్మెల్యే ఎన్ కిశోర్‌కుమార్‌రెడ్డికి అవకాశం దక్కనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలా ఎవరికి వారు ఎత్తులు పైఎత్తులు వేస్తూ మంత్రివర్గంలో అవకాశం కోసం ముమ్మర ప్రయత్నాలు ఆరంభించడం విశేషం.

గండి శాశ్వత నిత్యాన్నదానానికి వితరణ

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.3,00,116లు విరాళంగా వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఆలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. బెంగళూరుకు చెందిన నాయని శ్రీనాథరెడ్డి, హరిత రెడ్డి దంపతులతో పాటు వారి కుమారులు హర్షిత్ రెడ్డి, కృతిక్ రెడ్డి చక్రాయపేటలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులోని ఆలయ ఖాతాకు సదరు మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా జమ చేశారని చెప్పారు. ఈ మేరకు తగిన రశీదును కూడా తమకు పంపినట్లు వివరించారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులు అందరి పేరు పైన ప్రత్యేక పూజలు చేయించినట్లు పేర్కొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం అనంతరం సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ఆదివారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ జరిపారు. ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం జరిపారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ పాల్గొన్నారు.

జగనన్న ఆశయాలకు అనుగుణంగా సేవలందిస్తా



జెడ్పీటీసీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందిస్తానని మాజీ జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు.ఆదివారం ఆకేపాటి ఎస్టేట్‌లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని జెడ్పీటీసీలంకు వీడ్కోలు సభను ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు.ఈ సభకు విచ్చేసిన జెడ్పీటీసీలు ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ ఈ 32 నెలల కాలంలో జిల్లా అభివృద్ధికి మీరందరు ఇచ్చిన సహాయ సహకారాలు మరువలేనివని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశామని తెలియజేశారు. మాజీ సీఎం జగనన్నను ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవలో ముందుకు సాగుతానని అన్నారు. వీడ్కోలు సభకు విచ్చేసిన జెడ్పీటీసీ సభ్యులందరికీ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీలు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మో.. జూన్

- పెట్టు'బడి'కి కష్టాలు
- సేద్యానికి, చదువుకు భారం



మదనపల్లె సిటీ: బుడిబుడి నడకలతో పిల్లల బడిబాట..పచ్చని సిరులు కురిపించేందుకు పుడమి పుత్రులు పొలం బాట పట్టే సమయం రానే వచ్చింది. తొలకరి సాగుకు రైతన్న ఈ నెలలోనే సన్నద్ధమవుతుండగా, విద్యార్థులకు కొత్త విద్యా సంవత్సరం సైతం షురూ కానుంది. వ్యవసాయానికి పెట్టుబడి ఎంత అవసరమో, చిన్నారుల చదువులకూ అంత కన్నా ఎక్కువే ఖర్చవుతోంది. ఇది ఏటా జూన్ నెలలో తల్లిదండ్రులకు గుబులు పుట్టిస్తుంది. ఈ రెండింటికీ ఒకేసారి ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం ఇబ్బంది పడుతోంది.

ఫీజులు భారీగా చదివించాల్సిందే

పిల్లలను ఎంతో కొంత మంచి పేరున్న స్కూళ్లు, కళాశాలల్లో చదివించాలని తల్లిదండ్రులు ఆశపడుతుంటారు. ఇదే అదునుగా ఆయా యాజమాన్యాలు అధిక మొత్తంలో ఫీజులు గుంజుతున్నారు. జిల్లాలో 2,219 ప్రభుత్వ పాఠశాలల్లో 1,54,789 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల చదువులకు అవసరమైన పాఠ్య, నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగ్‌లు, షూష్, టై, బెల్ట్ వంటి సామాగ్రిని జగనన్న విద్యాకానుక రూపంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు అందజేసింది. ఈసారి కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ కానుకను చాలా వరకూ సిద్ధం చేసింది. ఈ కానుకలు ఏవి అందుతాయో, ఏవి అందవో తెలియక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు.

విత్తు నుంచీ ఖర్చులే..

జిల్లాలో చాలా మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతులు దుక్కి దున్నేందుకు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. దీంతో దుక్కి దున్నడం నుంచి విత్తనం వేసే వరకూ ఖర్చు రెట్టింపవుతోంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు పెట్టుబడులు బాగా అవసరమవుతాయి. ఏ పంట వేయాలన్నా తొలినాళ్లలోనే పెట్టుబడులు ఎకరాకు తక్కువలో తక్కువ రూ.25 వేలు ఖర్చు చేయాల్సిందే. ఇప్పటి వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగు పెట్టుబడి కోసం అర్హత ఉన్న ప్రతి రైతుకూ ఏటా రూ.13,500 సాయం అందించింది. ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం రావడంతో ఈ విధంగా సాగు పెట్టుబడిపై సామాన్య రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏదేమైనా జూన్ నెలలో గట్టెక్కడం సామాన్య రైతులకు ప్రహసనమే అవుతోంది.

విద్యార్థులకు ఆర్టీసీ శుభవార్త

- 'పాసు'ల రెన్యువల్‌కు కసరత్తు
- 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచితం
- త్వరలో ప్రభుత్వ పాలసీ ప్రకారం కొత్త దరఖాస్తులు
- గతేడాది 31,681 మందికి జిల్లాలో ప్రయోజనం



ఆర్టీసీ బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ బస్సులో బడికి వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ శుభవార్త చెబుతోంది. ప్రతి ఏటా మాదిరిగానే బస్సు పాసుల రెన్యూవల్‌కు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు రోజూ ఆర్టీసీ బస్సుల ద్వారా ఇంటికి... విద్యాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులకు ప్రజా రవాణాశాఖ ఏటా ఉచిత, రాయితీ బస్సు పాసులను మంజూరు చేస్తోంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు ఈనెల 13 నుంచి ప్రారంభించనున్నారు. అలాగే ఇప్పటికే ఈనెల 1వ తేది నుంచి కళాశాలలు పునః ప్రారంభమయ్యాయి.

చదువుకు తోడ్పాటు

జిల్లాలోని బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప, పులివెందుల డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత రాయితీ బస్సు పాసులను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థుల చదువుకు ఊతం ఇచ్చేలా ఏటా జిల్లా ప్రజా రవాణాశాఖ బస్సు పాసులను అందిస్తోంది. అందులోభాగంగా ఈ ఏడాది కూడా గతేడాది మంజూరు చేసిన రాయితీ బస్సు పాసులను రెన్యూవల్ చేస్తున్నారు. కొత్త పాసుల జారీ ప్రక్రియను ప్రభుత్వ పాలసీ ప్రకారం విడుదల చేసే అవకాశం ఉంది. రెండు నెలల సెలవుల తర్వాత విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజా రవాణాశాఖ బస్సు పాసుల రెన్యూవల్ కౌంటర్లను ప్రారంభించింది. పలువురు విద్యార్థులు బస్సులపై రాకపోకలు సాగించి చదువును కొనసాగిస్తున్నారు. అటువంటి వారికి బస్సు పాసులను జారీ చేస్తున్నారు.



ఎవరెవరికి ఇస్తారంటే....

అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగా బస్సు పాసులను జారీ చేస్తున్నారు. ఇది ఏడాది వరకు చెల్లుబాటు అవుతుంది. ఈ పాసుల ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకుగాను విద్యార్థి ఫొటో, స్కూలు యాజమాన్యం నుంచి బోనోఫైడ్ సర్టిఫికెట్, ధృవీకరణపత్రాన్ని సమర్పించాలి. మిగతా వారికి రాయితీపై పాసులను మంజూరు చేస్తారు. పాసు ధరతోపాటు సంవత్సరం గుర్తింపుకార్డు కోసం రూ. 100, నెలవారీ గుర్తింపు కార్డు కోసం రూ. 50, సర్వీసు చార్జీ రూ. 40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ బస్సు పాసులు నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితిపై జారీ చేస్తారు. గడువు ముగిశాక రెన్యూవల్ కోసం ప్రిన్సిపల్ సంతకం చేయించుకుని తిరిగి పొందాల్సి ఉంటుంది. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకు, ఐటీఐ, పారా మెడికల్ చదివే వారికి మే నెలలో కూడా పాసులను మంజూరు చేస్తారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజీగా పరిగణలోకి తీసుకుని దూరాన్ని బట్టి రాయితీ ఇస్తారు. జిల్లాలో కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి గతేడాది ఉచిత, రాయితీ, దివ్యాంగుల బస్సు పాసులు 31,681 మందికి జారీ చేశారు.

డిపో	ఉచిత పాసులు	రాయితీ పాసులు	దివ్యాంగుల పాసులు
కడప	1646	4983	493
పులివెందుల	1665	4755	746
బద్వేలు	1193	2601	322
జమ్మలమడుగు	1147	2147	258
ప్రొద్దుటూరు	2175	3298	480
మైదుకూరు	1764	2243	260
మొత్తం	9590	19527	2564

దివ్యాంగులకు..

ఆర్టీసీ దివ్యాంగులకు ఉచిత పాసులను అందజేస్తోంది. వీరు సదరన్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, అన్‌ఎంప్లాయ్‌మెంట్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. మూడేళ్ల కాల వ్యవధితో పాసులను జారీ చేస్తారు. ఐడీ కార్డు కోసం రూ. 100 చెల్లించాల్సి ఉంటుంది.

విద్యార్థులకు రాయితీ

చదువుకునే ప్రతి విద్యార్థి రాయితీ బస్సు పాసు పొందవచ్చు. చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాసులను జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటరు వరకు రాయితీ పాసును జారీచేస్తారు. కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. విద్యార్థి ఫొటో జతచేయడంతోపాటు విద్యార్థి నెలవారి, మూడు నెలలకు, సంవత్సరం పాసులను పొందవచ్చు. నెలవారి ఐడీ కార్డులకు రూ. 100 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

పాసు పొందే విధానం

జిల్లా ప్రజా రవాణాశాఖ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి. కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతోపాటు స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు సెల్ నెంబరుతో దరఖాస్తులను సమీపంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ పరిశీలించి పాసు మంజూరుకు సిఫార్సు చేస్తారు. వీటిని నిర్ణీత రుసుము చెల్లించి కౌంటర్ ద్వారా బస్సు పాసును పొందవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వ పాలసీ ప్రకారంఆర్టీసీ అధికారులు కొత్త బస్సులు జారీ చేసే అవకాశం ఉంది. ఈనెల 12వ తేది తర్వాత దీనిపై విధి విధానాలు వెలువడే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది మంజూరు చేసిన బస్సు పాసులను రెన్యూవల్ చేసే ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు.

రెన్యూవల్‌కు మాత్రమే అవకాశం



కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్టీసీ బస్సు పాసులను రెన్యూవల్ చేస్తున్నాం. ప్రభుత్వం అందించే బస్సు పాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. 50 కిలోమీటర్ల పరిధి వరకు రాయితీ బస్సు పాసులను జారీ చేస్తున్నాం. అలాగే సదరమ్ సర్టిఫికెట్లు పొందిన దివ్యాంగులకు కూడా 50 శాతం రాయితీతో బస్సు పాసును అందజేస్తున్నాం. ప్రభుత్వం జారీ చేసే నియమ నిబంధనల ప్రకారం కొత్త దరఖాస్తులను జారీ చేస్తాం. – పొలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

క్లుప్తంగా

పట్టపగలే ఇసుక అక్రమ రవాణా



టక్కోలి పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌తో తరలిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామ పంచాయతీ సమీపంలోని పెన్నానది ప్రాంతం నుంచి పట్టపగలే ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇసుకను పట్టణాలకు తీసుకొని వెళ్లి ఒక్కొక్క ట్రాక్టర్ ఇసుకను రూ. 5 వేలకు అమ్ముకుంటూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. ఈ విషయమై స్థానిక వీఆర్‌ఓ చంద్రను వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు కొంత మంది గ్రామస్తులు తమకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పెన్నానదిలోకి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



మృతి చెందిన ప్రమీలమ్మ

పెద్దతిప్పసముద్రం : జీవితంపై విరక్తి పెంచుకున్న ప్రమీలమ్మ (44) అనే మహిళ ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని టి.సదుంకు చెందిన వెంకటరమణ భార్య ప్రమీలమ్మ గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి పెంచుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం భర్త లేని సమయంలో సమీపంలోని వారి పొలం వద్ద చీరను గొంతుకు బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఈమె మృతిపై ఎవరికీ, ఎలాంటి అనుమానాలు లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో పడి ఉన్న నరసింహులు

వాల్మీకిపురం : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నగరిమడుగు సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. నిమ్మనపల్లి మండలం, ముష్టూరు పంచాయతీ గౌనివారిపల్లికి చెందిన ఎం. నరసింహులు (34) వాల్మీకిపురం మండలం నగరిమడుగులోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం తిరిగి సొంతూరైన గౌనివారిపల్లికి బయల్దేరాడు. నగరిమడుగు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన 108కు సమాచారం అందించి, వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాన్నలా శిక్షణ.. అమ్మలా లాలన

- ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఉన్నతికి దివ్యమైన భవిత
- ఇంటింటి సర్వే నిర్వహించిన భవిత కేంద్రాల ఈఐఆర్‌పీలు
- సమగ్రశిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి
- జిల్లాలో ముగిసిన ఇంటింటి సర్వే

జిల్లాలో భవిత కేంద్రాల సమాచారం

జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల సంఖ్య	: 36
భవిత కేంద్రాల సంఖ్య	: 12
నాన్ భవిత కేంద్రాలు	: 24
మొత్తం భవిత కేంద్రాల సంఖ్య	: 36
భవిత కేంద్రాలలో విద్యార్థుల సంఖ్య	: 780
ప్రస్తుతం సర్వే ద్వారా గుర్తించిన విద్యార్థుల సంఖ్య	: 636



కలసపాడు మండలం పుల్లారెడ్డిపల్లెలో సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్పీలు

కడప ఎడ్యుకేషన్ : దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు జిల్లావ్యాప్తంగా భవిత కేంద్రాల ఐఈఆర్‌పీలు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు పాఠశాలలో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమై 18 ఏళ్లలోపు ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల వివరాలను సేకరిస్తున్నారు. చదువు వల్ల ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. జిల్లాలో 36 మండలాల పరిధిలో 12 భవిత కేంద్రాలు, 24 నాన్ భవిత కేంద్రాలు ఉండగా వాటిలోని 72 మంది సహిత ఉపాధ్యాయులు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా జిల్లా వ్యాప్తంగా 636 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించారు. వారిలో కొందరు తమ పిల్లలను భవిత కేంద్రాలతోపాటు బడుల్లో చేర్చేందుకు సిద్ధం అవుతున్నారు.

సాధారణ విద్యార్థులతో సమానంగా...

సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను సైతం తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ భవిత కేంద్రాలలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వీటిపై చాలా మంది తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక తమ పిల్లలను తమ ఇళ్ల వద్దే ఉంచుకుని ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. వైకల్యంతో పుట్టిన తమ పిల్లల భవితవ్యం ఇంతేనంటూ మిన్నకుండి పోతున్నారు. ఇలాంటి వారికోసం ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి తగిన సేవలందిస్తోంది.

బహుళ ప్రయోజనాలు...

ప్రత్యేక అవసరాల పిల్లలను బడుల్లో చేర్పించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. చదువుకు కావాల్సిన అన్ని ఉపకరణాలు ఉచితంగా మంజూరు చేస్తారు. ఏడాది పాప నుంచి 18 ఏళ్లలోపు అన్ని రకాల వైకల్యం కలిగిన వారు ప్రస్తుతం జిల్లాలోని భవిత కేంద్రాలలో 780 మంది ఉన్నారు. వీరిలో ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ కింద చెవిటి, మూగ, బుద్ధిమాంద్యం కలిగి వైకల్యం ఉన్నవారికి నెలకు రూ. 300 చొప్పున, ఎస్కార్ట్ అలవెన్స్ కింద అంధులు, నరాల బలహీనత లోపం, శారీరక వికలాంగులు, బహుళ వైకల్యం ఉన్న పిల్లలకు నెలకు రూ. 300 చొప్పున, ఇంటి వద్దే విద్యనభ్యసిస్తున్న దివ్యాంగత్వం కలిగిన వారికి రూ. 300 చొప్పున, బాలికల అలవెన్స్ కింద రూ. 200 చొప్పున అలవెన్స్‌లను అందజేస్తారు. అయితే గత నెల 1 తేదీ నుంచి జూన్ 8వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 636 మందిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సంబంధిత సర్వే 9వ తేదీ ఆదివారంతో ముగిసింది.

ఉచితంగా ట్యాబ్‌లు..

జిల్లాలో భవిత కేంద్రాలలో వినికిడి, దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లను అందజేశారు. చదువులో బాగా రాణించే వారికి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు ఉన్నాయి. వైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువపత్రంలో పింఛన్ లభిస్తుంది. బస్సులు, రైళ్లలో ప్రయాణానికి పాసు లభిస్తుంది. ఇళ్లకే ఉపాధ్యాయులు వచ్చి అవసరమైన బోధనతో శిక్షణ ఇస్తారు.

సాధారణ విద్యార్థులతో సమానంగా..



సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది, ప్రజల్లో సరైన అవగాహన లేక ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు వీటి ప్రయోజనాలు పొందలేక పోతున్నారు. అంగ వైకల్యంతో పుట్టిన తమ పిల్లలను నాలుగు గోడల మధ్యనే పరిమితం చేస్తున్నారు. ఇలాంటి వారందరికి పాఠశాలల్లో చేర్చేందుకు సర్వే నిర్వహించాము. జిల్లా వ్యాప్తంగా 636 మందిని గుర్తించాము. – మిట్టా కేశవరెడ్డి, సహిత విద్య జిల్లా అధికారి, సమగ్రశిక్ష.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలన్నీ సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటింటి సర్వే ఆదివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో 636 మందిని గుర్తించాము. వారికి అన్ని రకాల పథకాలను వర్తింపజేసేందుకు కృషి చేస్తాం – మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారి.

భవిత కేంద్రాలతో ప్రయోజనాలు...

సమగ్రశిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఎన్నో సదుపాయాలు, వసతులు, రాయితీలు, రవాణా చార్జీలను అందిస్తూ ఉచిత విద్యను అందించేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది.

- భవిత కేంద్రాలలో వారానికి ఒక రోజు చొప్పున అవసరమైన పిల్లలకు ఫిజియోథెరపీ చేయిస్తారు.
- ప్రవేశాలు పొందిన బాలబాలికలకు భవిత కేంద్రాల ద్వారా ఉచిత పరికరాల పంపిణీకి వైకల్య నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు.
- భవిత కేంద్రాల్లో చేరిన వారికి రూ. 25 వేలు విలువ చేసే ట్యాబ్‌లను అందజేస్తారు. రూ. 10 వేల విలువ చేసే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్లు పంపిణీ చేస్తారు.
- ఒక్కో కిట్‌లో రూ. 1500 నుంచి 15 వేలు ఖరీదు చేసే ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారు. భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు నెలకు రూ. 300 చొప్పున ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ ఇస్తారు. ఎ
- నడవలేని విద్యార్థులను స్కూల్‌కు తీసుకువచ్చే వారికి ఎస్కార్టు అలవెన్స్ అందజేస్తారు.
- 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వారికి స్టైఫండ్ అందిస్తారు. అలాగే చదవలేని విద్యార్థులకు చదివి వినిపించే వారికి రీడర్ అలవెన్స్‌గా రూ. 300 చెల్లిస్తారు.
- సదరం సర్టిఫికెట్ జారీ చేయించి ప్రభుత్వ పెన్షన్లు, రాయితీలు వచ్చేలా చేస్తారు. అలాగే ఇన్సూరెన్స్ సదుపాయాలన్నీ కూడా వర్తింపజేస్తారు.

విహార యాత్రలో విషాదం



మాండవ్య నదిలో బాలుని మృతికి కారణమైన గుంత ఇదే



మృతి చెందిన బాలుడు అద్నాన్

నీటి గుంతలో ఈతకు వెళ్లి బాలుడి మృతి

వీరబల్లి : విహార యాత్రకు వెళ్లిన ఓ బాలుడు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం వీరబల్లి మండలంలో జరిగింది. వివరాలు ఇలా.. రాయచోటి పట్టణం నాయబ్‌సాబ్ వీధికి చెందిన టైలర్ షకీల్ కుమారుడు షేక్ అద్నాన్ (14) కుటుంబ సభ్యులతో కలిసి వీరబల్లి మండలం, వంగిమల్ల మార్గానికి వెళ్లే పుల్లగూర గండి వద్ద ఉన్న మాండవ్య నది వద్దకు ఆదివారం విహార యాత్రకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో అక్కడ తీసిన గుంతలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. మృతుడు పదో తరగతి చదువుతున్నట్లు సమాచారం. గత ఫిబ్రవరి నెలలో రూ. 6 కోట్ల వ్యయంతో కాజ్‌వే నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అందులో భాగంగా మాండవ్య నదిలో పునాదుల కోసం దాదాపు 20 అడుగుల గుంతలు తీసి కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా వదిలేశాడు. లోతుగా గుంతలు తీసి వదిలేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన ప్రేమజంట మృతి

కులాలు వేరని పెద్దలు పెళ్లికి అంగీకరించకపోవడంతో బలవన్మరణం



ప్రేమజంట నరేంద్ర, రాణి (ఫైల్)

మదనపల్లె /పెద్దతిప్పసముద్రం : ములకలచెరువు మండలం బత్తలాపురం అడవిలో ఆత్మహత్యకు ప్రయత్నించిన ప్రేమికులు, ఆస్పత్రిలో వేర్వేరుగా చికిత్స పొందుతూ రెండురోజుల తర్వాత మృతి చెందారు. ములకలచెరువు ఎస్‌ఐ తిప్పేస్వామి వెల్లడించిన వివరాల మేరకు.. దేవలచెరువుకు చెందిన నరేంద్ర(22) వేపూరికోట పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. వేపూరికోట పంచాయతీ ఎద్దులవారిపల్లెకు చెందిన రాణి(17)ని కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. వీరి వివాహానికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో దొంగచాటుగా పెళ్లిచేసుకున్నారు. తర్వాత పెద్దలు ఇబ్బందులు పెడతారనే భయంతో మండలంలోని సంద్రడవిలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన పశువుల కాపరులు ములకలచెరువు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకుని ప్రేమజంటను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ, రాణి ఆదివారం ఉదయం మృతిచెందగా, మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నరేంద్ర వేకువజామున మృతి చెందాడు.

దాయాదుల మధ్య ఘర్షణ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, బ్రహ్మంగారి వీధిలోని ఇంటి ముందు వీధిలో నీళ్లు పారవేస్తున్నారని మూడు రోజులుగా ఒకే కుటుంబానికి చెందిన దాయాదుల మధ్య గొడవ జరుగుతూ ఉంది. అది చిలికి చిలికి గాలి వానలా మారి ఆదివారం ఘర్షణకు దారి తీయడంతో ఆది పెద్ద వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆది పెద్దవెంకటేష్, ఆది చిన్న వెంకటేష్, ఆది వెంకటరమణ, ఆది లక్ష్మీదేవిలు, ఆది జానమ్మ, ఆది రమేష్, ఆది శ్రీను, ఆది విష్ణు, ఆది సంతోష్‌ల మధ్య ఘర్షణ జరిగింది. ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు.

దాడి కేసులో 16 మంది అరెస్టు

రాయచోటి టౌన్ : రాయచోటి మండల పరిధిలోని యండపల్లె పంచాయతీ బోయపల్లెలో జరిగిన దాడి కేసులో 16 మందిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్న సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిపై దాడి చేశారన్నారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన ఉసిరికాయల సిద్ధార్థ గౌడ్, అతని అన్న శివశంకర్, తల్లి ఉసిరికాయల వెంకట లక్షుమ్మ గాయపడ్డారన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి డీఎస్పీ రామచంద్రరావు ఆదేశాల మేరకు వీరిని రాయచోటి – కదిరి రోడ్డులోని చిన్నరామిరెడ్డిగారిపల్లె వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అరెస్టయిన వారిలో కొర్లకుంట మల్లికార్జున, వడ్లతల లక్ష్మిరెడ్డి, కలకడ కుమార్, మదనపల్లె బయన్న, పాగా శివమణి, గుండూరు లక్ష్మిరెడ్డి, కొర్లకుంట భానుప్రసాద్, దేరంగుల బయన్న, దేరంగుల బాలరాజు, యండపల్లె మహేష్ రెడ్డి, పెదివీటి రమణయ్య, గండి రమణయ్య, యండపల్లె లోకేశ్వరరెడ్డి, గొడ్డ ఎలగ దుగ్గలప్ప, తిప్పన బాలాంజనేయులు ఉన్నారు.

వరదరాజుల స్వామి ఆలయంలో హుండీ చోరీకి యత్నం



ఆలయం ముందు హుండీని పెకలించిన స్థలం



ఆలయ సమీపంలోని కొండపైన ఉన్న హుండీ

లింగాల : లింగాల మండలం వెలిదండ్ల గ్రామ సమీపంలోని వరదరాజులస్వామి ఆలయంలో శనివారం రాత్రి హుండీ చోరీకి దొంగలు విఫలయత్నం చేశారు. ఆలయం గర్భగుడి ముందు ఉన్న హుండీని పెకలించి సమీపంలోని కొండపైకి తీసుకెళ్లారు. దానిని పగలగొట్టేందుకు ప్రయత్నించారు. హుండీ ఇనుముతో చేసింది కావడంతో దొంగలు దాన్ని పగలగొట్టలేక అక్కడే వదిలి వెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీ పెకలించడం చూసి ఆలయ కమిటీ పెద్దలకు సమాచారం అందించారు. వెంటనే గ్రామ ప్రజలు అక్కడికి చేరుకొని హుండీ కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. కొండపై ఉన్న హుండీని గమనించి దాన్ని గ్రామానికి తరలించారు. ఆ హుండీని వెల్డింగ్ మిషన్‌తో తెరవగా అందులో సుమారు లక్ష రూపాయల నగదు, రెండు తులాల బంగారు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు వెంటనే ఆలయాల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన నాగరత్నమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని కడప–బెంగళూరు జాతీయ రహదారిపై మల్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామ పంచాయతీ ఎర్రగడ్డవాండ్లపల్లెకు చెందిన గంగులయ్య, ఆయన మరదలు నాగరత్నమ్మ, వారి మనువరాలు ద్విచక్రవాహనంపై మల్లూరు నుంచి కంచర్ల వైపు వెళ్తున్నారు. రాయచోటి నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడగా వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాగరత్నమ్మను తిరుపతికి రెఫర్ చేశారు. నాగరత్నమ్మ భర్త రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి



గ్రేసిస్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక మానసిక క్షోభకు గురై మృతి చెందిన మండల పరిధిలోని ఉప్పతివారిపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గొడుగునూరు గ్రేసిస్ మృత దేహాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేసిస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసేవారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోకలమల్లేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వంకెల పోలిరెడ్డి, సర్పంచ్‌లు గాజులపల్లె నరసమ్మ, కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ చేస్తేనే ఫిట్‌నెస్

- రాజంపేట ఇండోర్ స్టేడియంలో నిరుపయోగంగా జిమ్ పరికరాలు
- క్రీడా అధికారుల నిర్లక్ష్యం
- తుప్పు పడుతున్న వైనం



ఇండోర్ స్టేడియంలో నిరుపయోగంగా ఉన్న జిమ్ పరికరాలు

రాజంపేట టౌన్ : క్రీడాకారులకు ప్రధానంగా శరీర దృఢత్వం ప్రధానమైనది. అప్పుడే క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబరచి బాగా రాణించగలరు. శరీర దృఢత్వానికి ప్రధానంగా కావాల్సింది వ్యాయామం. వ్యాయామంలో అనేక రకాలు ఉన్నాయి. ఇందులో ప్రధానమైనది జిమ్. నిత్యం జిమ్ చేస్తే శరీర సౌష్టవం కలుగుతుంది. అందువల్ల జగన్ ప్రభుత్వంలో జిల్లాలోని పలు ఇండోర్ స్టేడియంలకు ముఖ్యంగా క్రీడాకారుల కోసం జిమ్‌కు ఏర్పాటుకు చర్యలు తీసుకొని పరికరాలను సైతం మంజూరు చేసింది. అందులో భాగంగా రాజంపేటలోని ఇండోర్ స్టేడియంలో జిమ్‌కు ఏర్పాటయ్యే పరికరాలను 2022వ సంవత్సరంలో అధికారులు సమకూర్చారు. అయితే క్రీడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు సంవత్సరాలైనా జిమ్ పరికరాలను బిగించకపోవడంతో అవి తుప్పుపట్టే స్థితికి చేరుకుంటున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన పెరగడంతో చాలా మంది ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అందువల్ల ఇండోర్ స్టేడియంలోని జిమ్ పరికరాలను బిగిస్తే క్రీడాకారులకే కాక నిత్యం క్రీడామైదానంలో పెద్దఎత్తున వాకింగ్ చేసే వాకర్స్‌కు కూడా జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని పట్టణ ప్రజలు అంటున్నారు.

రూ.10 లక్షల విలువ చేసే జిమ్ పరికరాలు

రాజంపేటలోని ఇండోర్ స్టేడియంలో ఉన్న జిమ్ పరికరాలు దాదాపు పదిలక్షల రూపాయిలకు పైగా విలువ చేయనున్నాయి. ఈ పరికరాలను బిగిస్తే క్రీడాకారుల శరీర దృఢత్వానికి ఇవి ఎంతగానో దోహదపడగలవు. ఒకేసారి దాదాపు 30 మంది జిమ్ చేసుకునే సామర్థ్యం గల పరికరాలు ఇక్కడ ఉండటం విశేషమని చెప్పాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో మినీ స్టేడియం ఉంది. పట్టణానికి చెందిన వందలాది మంది నిత్యం వ్యాయామం చేసేందుకు వేకువజాము నుంచే క్రీడామైదానానికి వస్తుంటారు. అందువల్ల జిమ్ పరికరాలను బిగిస్తే పట్టణ ప్రజలకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది.

కలెక్టర్ చొరవ చూపితేనే....

రాజంపేటలో క్రీడాకారులకు కొదవ లేదు. అలాగే క్రీడాకారులు వివిధ క్రీడలను సాధన చేసుకునేందుకు విశాలమైన మైదానం కూడా ఉంది. ఈ క్రీడామైదానంలో ఉన్న ఇండోర్ స్టేడియం కూడా క్రీడాకారులకు ఏమాత్రం ఉపయోగం లేక అధ్వానంగా తయారైంది. కనీసం జిమ్‌కోసం నిర్మించిన విశాలమైన గదిలో జిమ్ పరికరాలను అయినా బిగించేందుకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ చొరవ చూపాలని క్రీడాకారులు కోరుతున్నారు. జిమ్ అందుబాటులోకి తీసుకురాకుంటే ఇప్పటికే తుప్పు పడుతున్న జిమ్ పరికరాలు పూర్తి స్థాయిలో పనికిరాకుండా పోతాయని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిమ్ పరికరాలు పాడైపోతే రూ.10 పదిలక్షల ప్రజాధనం వృథా అయిపోతుందని క్రీడాకారులు, పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఉపయోగకరంగా ఉంటుంది



ఇండోర్ స్టేడియంలో ఉన్న జిమ్ పరికరాలను బిగిస్తే క్రీడాకారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడి క్రీడా మైదానానికి నిత్యం చాలా మంది వివిధ క్రీడల్లో సాధన చేస్తారు. అయితే ఎవరికి కూడా సరైన ఫిట్‌నెస్ లేదు. అధికారులు జిమ్ పరికరాలను వెంటనే బిగించేందుకు చర్యలు తీసుకోవాలి. – యోగీశ్వర్, వాలీబాల్ క్రీడాకారుడు, రాజంపేట

స్కూల్ బస్సు ఢీ కొని వ్యక్తి మృతి



మృతి చెందిన బాజ్జీ

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై మోటకట్ల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచోటికి చెందిన షేక్ బాజ్జీ (36) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు బాజ్జీ సొంత పనుల నిమిత్తం సంబేపల్లె వైపు నుంచి ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళ్తుండగా రాయచోటి నుంచి కలకడకు వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు సంబేపల్లె ఎస్‌ఐ రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.